కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 31, దొండ 15, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



కంటోన్మెంట్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదల వైద్యానికి సంజీవనిలా పని చేస్తోందని కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 150 డివిజన్ పరిధిలోని జుట్ట నవీన్ ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సంతోష్ యాదవ్, సాయం కోసం ఎమ్మెల్యే శ్రీగణేశ్ దగ్గరికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సిఫారసుతో నవీన్ వైద్యానికి రూ.2.5లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సంబంధిత పత్రాలను సంతోష్ యాదవ్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నేతలు వెంకట్ రా జు, దేవేందర్, బాల్‌రాజ్, రాజు, నాగేంద్ర తదితరులు.. లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



పావని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లికి చెందిన ఆ పార్టీ కార్యకర్త కడెం పావని ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందింది. ఆమెకు పార్టీ తరఫున బీమా చేయించడం వల్ల రూ.2లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును జేఏమ్మార్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మీనా భాస్కర్, కె. శంకర్, సాయికిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట చంద్రబాబునగర్ బస్తీలో ఆదివారం జనహిత సేవా ట్రస్ట్, బ్లూ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు 175 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్, బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ వి. క్రాంతి కిషోర్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ పద్ధతి వద్దు

లాలాపేట: ఆర్టీసీలో ఎన్నడూ లేని విధంగా ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్లు, డ్రైవర్లను నియమించే ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని ఆర్టీసీ జేఏసీ, బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చల సందర్భంగా యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి మళ్లీ వెల్ఫేర్ బోర్డు మీటింగ్‌పై సర్క్యులర్ జారీ చేయడం అంటే పుండు మీద కారం చల్లినట్లుగా ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం చేస్తున్న ఇలాంటి కవ్వింపు చర్యలను మానుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో సమ్మె వైపు వెళ్లాల్సి వస్తుందన్నారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

అడ్డగుట్ట: ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని కోరుతూ సోమవారం మారేడుపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద నిర్వహించనున్న సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి ఏ. సువర్ణ ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ సంతకాల సేకరణ కార్యక్రమం ఉంటుందని, బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

మళ్లీ భూ బదలాయింపు ఆశలు

ఎమ్మెల్యే చొరవతో మొదలైన సందడి



మడ్‌ఫోర్ట్‌లో రక్షణ భూముల్లో వెలిసిన బస్తీ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని కేంద్ర ప్రభుత్వ భూముల్లో వెలిసిన బస్తీవాసుల దశాబ్దాల ఎదురు చూపులకు త్వరలోనే తెరపడనున్నట్లు సమాచారం . ఆయా స్థలాలను భూబదలాయింపు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని పట్టాలు, హౌజింగ్ స్కీమును ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఇదే అంశంపై తాజాగా స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ రాష్ట్ర రెవెన్యూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన సూచన మేరకు జిల్లా కలెక్టర్, కంటోన్మెంట్ సీఈఓ, సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్‌లను సైతం కలిసి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. భూబదలాయింపు ప్రక్రియ కేంద్రం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తేల్చడంతో, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ సందర్భంగా ఆయనకు ఈ విషయం తెలిపారు. దీంతో ఆయన కంటోన్మెంట్‌లో భూబదలాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి లేఖరాయాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అతి త్వరలో కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భూబదలాయింపు చేపట్టి రక్షణ, పౌరవిమానయాన శాఖ స్థలాల్లోని వారి సొంతింటి కలను నెరవేరుస్తామని ఆయన అంటున్నారు.

- సుముఖత వ్యక్తం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రంతో సంప్రదింపులు కూడా ప్రారంభమైనట్లు ఎమ్మెల్యే వెల్లడి
- 10 వేలకు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం

పట్టాలేవు.. ఓట్లూ తొలగించారు..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని రక్షణ, పౌర విమానయాన భూముల్లో పదుల సంఖ్యలో బస్తీలు వెలిశాయి. వీటిలో కొన్ని స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉన్నవి కాగా, కొన్ని మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పడ్డాయి.

- నిరుపేదలు అధిక సంఖ్యలో ఉండే ఆయా బస్తీల్లో 90 శాతానికి పైగా నివాసాలు 100 గజాల లోపు స్థలంలో వెలిసినవే.
- మడ్‌ఫోర్ట్, 108 బజార్, సాయిబాబా హట్స్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ గుడిసెలే ఉండం విశేషం. ఈ బస్తీల్లో నేటికీ తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సదుపాయాలు లేకపోవడం శోచనీయం. పబ్లిక్ టాయిలెట్‌ల నిర్మాణానికి సైతం ఆర్మీ అధికారుల నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. 30 ఏళ్ల క్రితమే వెలిసిన మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ నగర్ బస్తీకి రెండేళ్ల క్రితమే విద్యుత్ సదుపాయం లభించింది.
- ఏడోవార్డు పరిధిలోని చిన్న కమేళా, సెంట్రల్ బట్టీ, ఆరోవార్డు పరిధిలోని నందమూరినగర్, ఒకటో వార్డు పరిఇధిలోని శివాలయం బస్తీలదీ దాదాపు ఇదే పరిస్థితి. ఇక పౌరవిమానయాన శాఖ స్థలాల్లో రసూల్‌పురా, అన్నానగర్ పరిధిలో సుమారు 20 బస్తీలు వెలిశాయి. ఆయా బస్తీల్లోని సుమారు 10వేల కుటుంబాలకు నేటికీ యాజమాన్య హక్కులు లేవు.
- ఏడేళ్ల క్రితం కంటోన్మెంట్ అధికారులు ఆయా బస్తీల్లోని పౌరులకు కంటోన్మెంట్ బోర్డు ఓటరు లిస్టు జాబితాలో ఓట్లు తొలగించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమిత నివాసాల్లోని వారికి బోర్డు ఓటరు జాబితాలో స్థానం కల్పించొద్దన్న సుప్రీం ఆదేశాలతోనే ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు బోర్డు అధికారులు తెలిపారు.

1994లో చివరిసారిగా..

- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పేదలకు పట్టాల కోసం చివరిసారిగా 1994లో భూబదలాయింపు చేపట్టారు. 28.697 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించుకుని, రక్షణ శాఖకు 86 ఎకరాల రాష్ట్ర ప్రభుత్వ భూములను అప్పగించారు. ఈ బదలాయింపు ద్వారా బొల్లారంలో 5.19 ఎకరాలు, తిరుమలగిరిలో 6.627 ఎకరాలు, కార్ఖానాలో 2.79 ఎకరాలు, బాలంరాయిలో 3.26 ఎకరాలు, మడ్‌ఫోర్ట్ 2.50 ఎకరాలు, బోయిన్‌పల్లిలో 1.09 ఎకరాలు, రసూల్‌పురాలో 8.24 ఎకరాల్లో బస్తీ వాసులకు పట్టాలు దక్కాయి. నాటి నుంచి మిగతా బస్తీవాసులు సైతం పట్టాల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు.

పశువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో బాలానగర్ ఏసీపీ

సనత్‌నగర్: పశువుల వ్యాపారులు క్రయ విక్రయాల సమయంలో నిర్దిష్ట నిబంధనలు పాటించాలని బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి సూచించారు. మోతీనగర్ బబ్బుగూడ పశువుల మార్కెట్‌లో ఆదివారం పశువుల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ పశువుల మార్కెట్‌లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. పశువులు రవాణా చేసేటప్పుడు డాక్టర్ సర్టిఫికెట్‌తో పాటు రసీదులు ఉండాలన్నారు వచ్చే నెల 7న బక్రీద్ పండుగకు ఒక రోజు ముందు మార్కెట్ మొత్తం ఖాళీ చేయిస్తామని.. ఇందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్,డైరెక్టర్లు, సెక్రటరీ, వెటర్నరీ డాక్టర్‌తో పాటు సుమారు 50 మంది సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ మనోరమ సుంకరకు ప్రతిష్టాత్మక అవార్డు

లాలాపేట: సీఎస్‌ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసిటి) మాజీ చీఫ్ సైంటిస్టు డాక్టర్ మనోరమ సుంకర వర్థిరెడ్డికి భారత ప్రభుత్వం అణు శక్తి విభాగం(డీఏఈ) ప్రతిష్టాత్మకమైన రాజ రామన్న చైర్ (ఆర్‌ఆర్‌సీ)ని ప్రదానం చేసింది. దశాబ్దకాలంగా మెటీరియల్ సైన్స్‌లో రసాయన సెన్సార్లు నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్‌లో చేసిన పరిశోధనలకుగాను ఈ గుర్తింపు లభించింది. డీఏఈ స్థాపించిన నాటి నుంచి భారతదేశ అణు కార్యక్రమానికి రూప శిల్పులలో ఒకరైన డాక్టర్ రాజ రామన్న పేరున పరిశోధనల్లో విశేష కృషి చేసిన రిటైర్డు శాస్త్రవేత్తలకు, ఇంజనీర్లకు ప్రదానం చేస్తున్నారు.

మిస్ వరల్డ్ పోటీలను విమర్శించడం తగదు

సనత్‌నగర్: మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం యావత్ భారతదేశం గర్వించదగ్గ విషయమని, అలాంటిది కొందరు పనిగట్టుకుని విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం అన్నారు. బేగంపేటలోని ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మేగీ మిస్ వరల్డ్ పోటీల్లో భాగం కాకపోవడం పట్ల తాము విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. మిల్లా మేగీ స్థానంలో మిస్ ఇంగ్లాండ్ రన్నరప్ షార్లట్ గ్రాంట్ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీలతో హైదరాబాద్ ప్రతిష్ట ఎంతో పెరిగిందని, కానీ కొంతమంది అనవసర రాద్ధాంతంతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇకపై అర్థరహిత ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

సింగరేణి సహకారంతో ఓయూలో తరగతి గదులు

ఉస్మానియా యూనివర్సిటీ: సింగరేణి ఆర్థిక సహకారంతో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో తరగతులు నిర్మించారు. ఈసీఈ విభాగంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన తరగతి గదులను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించారు. సీఎస్ఆర్‌లో భాగంగా సింగరేణి ఓయూకు ఆర్థిక సహాయం చేసినట్లు బలరామ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.మంగు, ఈసీఈ విభాగం హెడ్ ప్రొ.రామకృష్ణ, సింగరేణి అధికారులు భాసర్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగాయాత్ర



సికింద్రాబాద్: సికింద్రాబాద్ బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం సీతాఫల్‌మండి-వారాసీగూడలో తిరంగా యాత్ర నిర్వహించారు. నగర యువ మోర్చ నాయకులు అల్లాడి గంగాధర్, కప్పెర సందీప్, శివాజీ నేతృత్వంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, కనకట్ల హరి, రాచమల్ల కృష్ణమూర్తి, మద్దెర్ల శ్యాం సుందర్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



సనత్‌నగర్: వైశాఖ మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రుద్ర హోమం, సాయంత్రం ప్రదోష కాలంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మాస శివరాత్రి పూజలు నిర్వహించారు.

ఎస్సీ గురుకుల కళాశాలలను కొనసాగించాలి

సికింద్రాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 12 గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఆదివారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఆమె సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహానికి 23 వారం జ్ఞానమాల వేశారు. విద్యార్థులు చేరడం లేదన్న సాకుతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల జూనియర్ కళాశాల మూసివేసేందుకు సన్నాహాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ ప్రతినిధులు శంకర్, పుష్ప, సీమ తదితరులు పాల్గొన్నారు.

ఐ ఫోన్ నకిలీ పార్ట్స్ విక్రేతల అరెస్టు

అబిడ్స్: ఐ ఫోన్‌కు సంబంధించిన నకిలీ పరికరాలు విక్రయిస్తున్న దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లోని మాతాజీ, ఆర్.జి.మొబైల్, రాజారామ్, న్యూ డ్రీమ్స్ సెల్‌ఫోన్ దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించిన పోలీసులు పెద్ద ఎత్తున నకిలీ యాపిల్ ఫోన్ పరికరాలను స్వాధీనం చేసుకుని విక్రమ్‌సింగ్, సురేష్ కుమార్, మహ్మద్ సర్ఫరాజ్, నాతురామ్ చౌదరి, మహ్మద్ అర్షద్‌ను అరెస్టు చేశారు.

అడవులను కాపాడుకుందాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఆరోగ్యం కోసం అడవులను కాపాడుకుందామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో ప్రకృతి-ఆరోగ్య రాష్ట్ర మహాసభ జరిగింది. కార్యక్రమానికి సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం నిర్వాహకులు, ప్రకృతి వైద్యుడు టి.వెంకన్న అధ్యక్షత వహించగా జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ డా.తిప్పర్తి యాదయ్య, గాయకులు జయరాజ్, పర్యావరణ వేత్త జడ్చర్ల సత్యనారాయణ, ఆదర్శ రైతు లావణ్య, ప్రకృతి వైద్య నిపుణులు పాల్గొని ప్రసంగించారు. ఆదివాసులను, అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ఆహారమే ఔషధం అని ప్రాచీన ఆయుర్వేద ఆరోగ్య కేంద్రంగా పని చేస్తూ 40 రోజుల ఆహార దీక్షల ముగింపు సందర్భంగా మహాసభను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలోడా.కొండ నాగేశ్వర్ రావు, డా.ఉపేందర్, డా.దుబ్బ రంజిత్, అర్జున్ రావు, టీజేఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో మాట్లాడుతున్న డా.తిప్పర్తి యాదయ్య

రోడ్లపై వ్యర్థాల తొలగింపు..

సనత్‌నగర్: గత కొన్ని రోజులుగా బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్‌లో పేరుకుపోయిన చెట్ల కొమ్మల వ్యర్థాలను ఎట్టకేలకు ఆదివారం తొలగించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే రోడ్ల పైనే డంప్ చేశారు. దీనికి తోడు పారిశుధ్య సిబ్బంది ఊడ్చే చెత్తను కూడా అక్కడే పడేస్తుండడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్తతో పాటు వర్షాలు విరివిగా పడడంతో దోమల వృద్ధికి ఆస్కారం ఏర్పడుతుండటంతో ఆదివారం పారిశుధ్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలనీలో పేరుకుపోయిన చెత్త చెదారాలను, వ్యర్థాలను, చెట్ల కొమ్మలను తొలగించారు.అలాగే ఇంకుడుగుంతలను పునరుద్ధరింపజేశారు.



బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్‌లో చెత్తను తరలిస్తున్న దృశ్యం..

అల్లరిమూకలు..అసాంఘిక కార్యకలాపాలు..

- మందుబాబులకు అడ్డాగా వాటర్ ట్యాంక్ ఏరియా
- బి- సెక్షన్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో స్థానికుల అవస్థలు

అడ్డగుట్ట: డివిజన్‌లోని బి-సెక్షన్ వాటర్ ట్యాంక్ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ రోజురోజుకూ పోకిరీల ఆగడాలకు అడ్డూ.. అదుపు లేకుండా పోతోంది. రాత్రైతే చాలు వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో ఉంటూ .. మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో కంటిపై కునుకు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వాళ్ల తీరు మార్చుకోవడం లేదని, బస్తీల్లో అడ్డాలు ఏర్పరచుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. గంజాయి కూడా తీసుకుంటున్నారని, దీనిపై పోలీసులు నిఘా పెంచాల్సిన అవసరం ఉందంటున్నారు.

అడ్డాలుగా పలు ప్రాంతాలు....

అడ్డగుట్టలోని బి సెక్షన్ వాటర్ ట్యాంక్ ప్రాంతంతో పాటు, అడ్డగుట్ట కమ్యూనిటీహాలు, ఏసీఎస్ నగర్





చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన బీ సెక్షన్ వాటర్‌ట్యాంక్

స్కూలు ప్రాంతం, మారాతా బస్తీ, శాస్త్రినగర్, సమోసా గార్డెన్, తుకారాంగేట్ రైల్వే ట్రాక్స్ తదితర ప్రాంతాల్లో మందుబాబులు, పోకిరీలు గుంపులు గుంపులుగా కనిపిస్తారు. ముఖ్యంగా బి సెక్షన్ వాటర్ ట్యాంక్, ఏసీఎస్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రాంతాల వద్ద నిత్యం అల్లరి మూకలు మద్యం సేవిస్తుంటారు. అర్ధరాత్రి సమయాల్లో గంటల తరబడి గోల చేస్తూ హంగామా చేస్తుంటారు. పోలీసులు సైరన్ వేసుకొని వస్తే పారిపోతున్నారని చెబుతున్నారు.

జలమండలి నిర్లక్ష్యం..

బి సెక్షన్ వాటర్ ట్యాంక్‌పై సంబంధిత జలమండలి అధికారులు దృష్టికి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో పూర్తిగా చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో అడవిని తలపిస్తోంది. అధికారులు, పోలీసులు దృష్టి సారించి వాటర్ ట్యాంక్ ప్రాంగణాన్ని శుభ్రం చేయించి, అల్లరి మూకల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

నో ఎంట్రీ సమయంలో నగరంలోకి వచ్చిన బస్సు

కేసు నమోదు

సనత్‌నగర్: నో ఎంట్రీ సమయంలో నగరంలోకి ప్రవేశించిన ట్రావెల్ బస్సు డ్రైవర్‌తో పాటు యజమానిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన టీవీకే ట్రావెల్ బస్సు ఈ నెల 23న రాత్రి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అవుట్ గేటు మీదుగా వెళ్తుంది. అదే సమయంలో అక్కడ తన సిబ్బందితో కలిసి ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆనంద్‌కుమార్ బస్సును ఆపారు. నిబంధనలు ఉల్లంఘించి నో ఎంట్రీ సమయంలో నగర పరిధిలోకి రావడం చట్ట విరుద్ధమని, చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ ఎస్ఐ బేగంపేట పోలీసులకు ఫిరాదు చేశారు. హయత్‌నగర్‌కు చెందిన డ్రైవర్ దేవేందర్‌తో పాటు బెంగుళూరు సర్జాపురా కబాలమ్మ టెంపుల్ రోడ్డుకు చెందిన బస్సు యజమాని గోపాల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

సనత్‌నగర్: గంజాయి తాగుతున్న ఇద్దరిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సనత్‌నగర్ ఎస్ఐ అబ్దుల్ హయ్యుమ్ శనివారం సాయంత్రం సిబ్బందితో కలిసి సనత్‌నగర్ రైల్వేస్టేషన్ లారీ అడ్డా ప్రాంతంలో తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో లారీ అడ్డా వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సిగరెట్ తాగుతుండగా గమనించి వారి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. వారి నుంచి గంజాయి వాసన వస్తుండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయి సేవించినట్లుగా ఒప్పుకున్నారు. సనత్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభాకర్‌రెడ్డినగర్‌కి చెందిన కూరగాయల విక్రేత భవానీ ప్రసాద్ మారుతి (21), దీన్‌దయాళ్ నగర్‌కు చెందిన డెలివరీ బాయ్ ఈశ్వర్ (21)లుగా పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉల్లంఘనులపై నిఘా

- నిబంధనలు పాటించని వారిపై ట్రాఫిక్ పోలీసుల కొరడా
- హోటళ్లు, వ్యాపారస్తులపై కేసుల నమోదు

బన్సీలాల్‌పేట్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, కూడళ్లు, ట్రాఫిక్ చౌరస్తాల వద్ద వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అదే పనిగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కేసులు పెడుతున్నారు. మహంకాళి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 15 రోజుల్లో 11 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశారు. బడా వ్యాపారస్తులు రాజకీయంగా పోలీసులపై ఒత్తిళ్లు తెస్తున్నా ఎవరి మాట వినకుండా ముందుకు సాగడం గమనార్హం.

ఎక్కడెక్కడ అంటే..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, ఆల్ఫాహోటల్, రైల్వే పార్సెల్ కార్యాలయం రోడ్, మోండా మార్కెట్, ఆర్పీ రోడ్డు, ప్యాట్నీ చౌరస్తా, రాణిగంజ్, కర్బలామైదాన్, బైబిల్ హౌస్ నిత్యం ట్రాఫిక్, జన సంచారం, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతాలు, రోడ్లు. ఇక్కడ ఎక్కడ కూడా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా రోడ్లపై విచ్చల విడిగా తోపుడుబండ్ల వ్యాపార కార్యకలాపాలు సాగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు, ఆల్ఫా హోటల్, పార్సెల్ ఆఫీసు రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తగ్గాయని పలువురు సాక్షితో పేర్కొన్నారు.ఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్‌పై మహంకాళి ట్రాఫిక్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు

– ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రజలను ఇబ్బంది పాలుజేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ చెప్పారు. అసలే ఇరుకైన రోడ్లు దానికి తోడు రోడ్లపై వ్యాపార కార్యకలాపాలు..ఫుట్‌పాత్ ఆక్రమణ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. అలాంటి ప్రాంతాలను ముందుగా గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు.